# భక్తులకు కనీస వసతులు కరువు

**ఆలయ అధికారులను ప్రశ్నించిన పట్టణ బీఆర్ఎస్ నాయకులు**

వేములవాడ టౌన్, మార్చి 31 : రాజన్న ఆలయానికి నిత్యం వేల సంఖ్యలో భక్తులు వస్తున్నారని, వారికి కనీస వసతులు కరువయ్యాయని ఇకనైనా వాటిపై దృష్టిపెట్టి భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని సోమవారం ఆలయ ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్‌కు పట్టణ బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఏ ఆలయంలోనైనా భక్తులకు ప్రసాదం ఉచితంగా అందజేస్తున్నారని, ఏటా భక్తుల ద్వారా 120 కోట్లకుపైగా ఆదాయం వస్తున్నా రాజన్న ఆలయంలో కనీసం ఉచితంగా ప్రసాదం పెట్టే సంప్రదాయాన్ని మరిచిపోయారన్నారు. క్యూలైన్లలో భక్తులు అనేక అవస్థలు పడుతున్నారని, వారికి కనీసం తాగునీరు అందించే నాథుడు లేడన్నారు. ఇకనైనా రాజన్న ఆలయానికి ఎంతో భక్తిశ్రద్ధలతో వచ్చి మొక్కులు చెల్లించుకునే భక్తులపై కొంత కనికరంగా ప్రవర్తించి, వారికి కనీస సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ వినతిపత్రం సమర్పించిన వారిలో పట్టణ బీఆర్ఎస్ నాయకులు రామతీర్థపు రాజు, నిమ్మశెట్టి విజయ్,గోలి మహేశ్, సిరిగిరి రామచంద్రం, జోగిని శంకర్, మారం కుమార్ తదితరులు ఉన్నారు.

## దరఖాస్తు చేసుకోవాలి : కలెక్టర్

కలెక్టరేట్, మార్చి 31 : జిల్లాలోని అర్హులైన యువత రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు (ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, బౌద్ధ, జైన, పార్శి)లకు చెందిన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల ద్వారా ఆర్థిక పురోగతి పెంపొందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిందని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువత జిల్లా వ్యాప్తంగా OBMMS ఆన్లైన్ పోర్టల్ 'http://tgobmmsnew.cgg.gov.in' ద్వారా దరఖాస్తు నమోదు చేసుకోవాలని సూచించారు.

## పోలీసుల ఔదార్యం


దవాఖానకు తరలిస్తున్న సీఐ,ఎస్ఐ

చందుర్తి, మార్చి 31: ప్రమాదంలో గాయపడ్డ ఓ మహిళను 108 అంబులెన్స్‌లో దవాఖానకు తరలించి ఔదార్యం చాటారు చందుర్తి పోలీసులు ఆదివారం అర్ధరాత్రి విధి నిర్వహణలో భాగంగా వేములవాడ నుంచి చందుర్తి మీదుగా సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అంజయ్య వెళ్తుండగా మర్రిగడ్డ బస్టాండ్ ప్రాంతంలో ప్రమాదంలో గాయపడ్డ మహిళను చూసి ఆగారు. వెంటనే వారు సదరు మహిళను 108 అంబులెన్స్‌లో దవాఖానకు తరలించారు. వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందించారు. వీరికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# చిరుతనా? కుక్కలా..?

- వరుస దాడులతో దూడలు మృతి
- చిరుతనే అంటున్న రైతులు
- కన్నెత్తిచూడని పశు, అటవీశాఖ అధికారులు
- భయాందోళనలో నిజామాబాద్ గ్రామస్తులు


తాళ్లపల్లి అరవింద్ అనే రైతు పశువుల పాక వద్ద మృతిచెందిన దూడ

కోనరావుపేట, మార్చి 31: గ్రామశివారులో ఉన్న పశువుల పాకల వద్ద రోజుకో దూడ వరుసగా మృత్యువాత పడుతున్నాయి. దూడలను కుక్కలూ చంపుతున్నాయా.. చిరుత చంపుతుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకే విధంగా రాత్రి సమయాన దూడలు మృతి చెందడం, అక్కడే చంపిన జంతువు పెద్దపెద్ద కాలిముద్రలు ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరుసగా దాడులు జరుగుతున్నా.. అటవీశాఖ, పశువైద్యశాఖ అధికారులెవరూ గానీ అటువైపు కన్నెత్తిచూడడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఇప్పటికీ నాలుగు దూడలు..**

కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామ శివారులో శ్రీ గుడిపేట రామలింగేశ్వర స్వామి ఆలయం వైపు పలువురు రైతుల పశువుల పాకలు ఉన్నాయి. ఎండాకాలం కావడంతో రైతులు రాత్రి సమయాన మేత కోసం పశువులను బయటనే కట్టివేసి ఉంచుతున్నారు. రైతులు సాయంత్రం వేళలో పాడి గేదెల పాలు పితికి దూడలను కట్టివేసి ఇంటికి వస్తున్నారు. తెల్లవారుజామున వెళ్లే సరికి దూడలు మృతి చెంది ఉంటున్నాయి. గత మార్చి 29న లంబ పుట్టయ్యకు చెందిన దూడ, మార్చి 31న తాళ్లపల్లి అరవింద్ అనే యువ రైతుకు చెందిన దూడను వెనుకభాగంలో దాడి చేసి హతమార్చాయి. దూడలు మృతి చెందిన ప్రాంతంలో పెద్దపెద్దగా కాలిముద్రలు ఉన్నట్లు సదరు రైతులు తెలిపారు. సుమారు రూ.20వేల విలువైన దూడలు మృతిచెందినట్లు వారు వాపోయారు. ఈ ఘటనలు రాత్రి సమయంలో జరగతుండడంతో దూడలు ఎలా మృతి చెందుతున్నాయో రైతులకు పాలు పోవడంలేదు. ఈ క్రమంలో గంగిరెద్దుల కాలనీవాసుల కుక్కలు చంపుతున్నాయా.. చిరుత చంపివేస్తుందా.. అనే రైతులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా ఇదే శివారులో ఈర్ల మొండయ్యకు చెందిన రెండు దూడలు మృతి చెందినట్లు రైతులు తెలిపారు. ఇదంతా జరుగుతున్న అటవీ, పశు వైద్యశాఖ అధికారులు కన్నెత్తి కూడా చూడడం లేదని రైతులు వాపోతున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి మృతిచెందిన దూడలకు నష్టపరిహారం అందించేలా చూడాలని కోరడంతో పాటు పశువుల రక్షణకు చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

### నష్టపరిహారం అందించాలి



మూలవాగు ప్రాంతంలో రామలింగేశ్వర స్వామి ఆల యం ముందు వైపు మా పశువుల పాక వద్ద పాడి గేదెలను రోజు మాదిరిగా కట్టేసిన. ఆదివారం రాత్రి గేదెలను మేత కోసం చెట్టుకు కట్టేసి ఇంటికి వచ్చిన. సోమవారం పశువులపాక వద్దకు వెళ్లేసరికి దూడ మృతి చెంది ఉన్నది. దాని పక్కనే పెద్ద జంతువు కాలిముద్రలు ఉన్నాయి. సుమారు రూ.10వేల విలువైన దూడను నష్టపోయాను. మా గ్రామంలో దూడలపై వరుసగా దాడులు జరుగుతున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడంలేదు. చనిపోయిన దూడలకు నష్టపరిహారం అందించాలి.

**- తాళ్లపల్లి అరవింద్, యువరైతు, నిజామాబాద్(కోనరావుపేట)**

## పల్లె ప్రకృతి వనంలో శిలాఫలకం ధ్వంసం

కోనరావుపేట, మార్చి 31 : మండలంలోని వెంకట్రావుపేటలో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనంలో గుర్తుతెలియని వ్యక్తులు శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. మాజీ ఎమ్మెల్యే రమేశ్‌బాబు కృషితో సర్పంచ్ మంతెన సంతోష్ పల్లె ప్రకృతి వనంను మండలంలోనే నంబర్‌వన్‌గా తీర్చిదిద్దారు. ఇదంతా ఓర్వలేక గుర్తుతెలియని వ్యక్తులు రాజకీయ కక్ష్యలతో శిలాఫలాకాన్ని ధ్వంసం చేశారు. పోలీసులు ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి, చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.


వెంకట్రావుపేటలో ధ్వంసమైన శిలాఫలకం

# క్రీడలతో మానసికోల్లాసం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, మార్చి 31 : క్రీడలు మానసికోల్లాసాన్ని ఇస్తాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచించారు. జిల్లా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాజన్న ప్రీమియర్ లీగ్ పోటీలను సోమవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలతో క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడలు శారీరక వ్యాయామంతో పాటు స్నేహభావాన్ని కూడా పెంపొందిస్తాయన్నారు. ఐఎంఏ అధ్యక్షుడు నాగమల్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్, వేములవాడ ఏరియా దవాఖాన సూపరింటెండెంట్ పెంచలయ్య, వైద్యులు కే మనోహర్, రేగులపాటి మహేశ్ రావు, ఆనంద్‌రెడ్డి, సందీప్ కుమార్, లయన్స్‌క్లబ్ సభ్యులు ఉన్నారు.

**రాజన్న అభివృద్ధి పనులకు టెండర్ పూర్తి**

వేములవాడ, మార్చి 31: రాజన్న ఆలయ అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభమవుతాయని, ఇందుకు టెండర్ ప్రక్రియ పూర్తయిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. సోమవారం పట్టణంలోని రెండో బైపాస్ రహదారిలో కూరగాయల వ్యాపారుల కోసం 14వ ఆర్థిక సంఘం నిధులు రూ. 80 లక్షలతో షెడ్లు, 56 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజ్ నిర్మాణాలకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వేములవాడలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పట్టణాన్ని తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు.

**భూసేకరణకు రూ. 6 కోట్ల నిధులు..**

వేములవాడ పట్టణ ప్రజలతో పాటు రాజన్న భక్తులు సుదీర్ఘంగా ఎదురుచూస్తున్న మూడో వంతెన నిర్మాణం చేపడుతున్నామని వివరించారు. భూ సేకరణకు రూ.6 కోట్ల నిధులు కేటాయించి, కాంట్రాక్టర్లను ఒప్పించి పనులు ప్రారంభించామన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, సెస్ డైరెక్టర్ నామాల ఉమ, ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

# విద్యార్థులపై లాఠీచార్జి అమానుషం

**బీఆర్ఎస్ రాష్ట్ర నేత రవిగౌడ్**


సిరిసిల్ల టౌన్ : మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రవిగౌడ్

సిరిసిల్ల టౌన్, మార్చి 31 : విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జి అమానుష చర్య అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. సోమవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీలో 400 ఎకరాలను ప్రభుత్వం ధ్వంసం చేస్తున్నదని ఆరోపించారు. అడ్డుకోబోయిన విద్యార్థులపై పోలీసులతో విచక్షణ రహితంగా దాడులు చేయిస్తున్నదని వాపోయారు. 200 మందికిపైగా విద్యార్థులను అరెస్ట్ చేసి, హైదరాబాద్‌లోని పోలీస్‌స్టేషన్లకు తరలించి ఇబ్బందులు పెడుతున్నారన్నారు. తమ యూనివర్సిటీ భూములను కాపాడుకునేందుకు విద్యార్థులు చేస్తున్న పోరాటంపై పోలీసుల దౌర్జన్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విద్యార్థునులను జుట్టు పట్టుకుని లాక్కెళ్తున్నారని ఇంతటి కర్కశత్వం ఎంతవరకు సమంజసమని, ఇందిరమ్మ పాలన అంటే ఇదేనా? అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి కనుసన్నల్లోనే విద్యార్థులపై దౌర్జన్యకాండ కొనసాగుతున్నదని ఆరోపించారు. విద్యార్థుల పోరాటాలతో గద్దెనెక్కి ఇప్పుడు వారిపైనే దాడులు చేయడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం చేస్తున్న లాఠీచార్జిని కవరేజి చేసేందుకు వెళ్లిన మీడియాపై సైతం దాడి చేయడం సరికాదన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ భూముల ధ్వంసం, విద్యార్థులపై దాడి ఘటనపై బీఆర్ఎస్ నిరంతర పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు మట్టే శ్రీనివాస్, ముగ్దం అనీల్, వెంకటేశ్, అడిచర్ల సాయి, రాజు, మహేశ్, నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.


ముస్తాబాద్ : మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

**జుట్టుపట్టి లాకెళ్లడమే ఇందిరమ్మ రాజ్యమా?**

ముస్తాబాద్, మార్చి 31: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సి టీలో ఉగాది పండుగ రోజున భూమిని చదును చేసి విక్రయించాలనుకున్న ప్రభుత్వ ప్రయత్నాన్ని అడ్డుకున్న విద్యార్థుల ను జుట్టుపట్టి ఈడ్చుకెళ్లడమే ఇందిరమ్మ రాజ్యమా అని ముస్తాబాద్ బీఆర్ఎస్ మండల నాయకులు ప్రశ్నించారు. విద్యార్థులపై సర్కారు ప్రదర్శించిన తీరును సోమవారం వారు ఖండించారు. ఈ క్రమంలో మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండలాధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అణిచివేత విధానాలను ప్రజలు గమనిస్తున్నా రని తెలిపారు. ఇచ్చిన హామీల గురించి నిలదీస్తుంటే అమలు చేయడం చేతగాక ప్రజలు, విద్యార్థులు, విద్యావంతుల గొంతునొక్కు తున్నారని విమర్శించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం తప్పదన్నారు. ఇక్కడ పార్టీ పట్టణాధ్యక్షుడు ఎద్దండి నరసింహారెడ్డి, నాయకులు కోడె శ్రీనివాస్ భరత్, నల్ల నర్సయ్య ఉన్నారు.

చందుర్తి, మార్చి 31 : హైదరాబాద్‌లో సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలానికి సీఎం రేవంత్ రెడ్డి కుట్ర రూపొందించారని బీఆర్ఎస్ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు రాజు ఆరోపించారు. భూములను వేలం ద్వారా అమ్మే నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే విద్యార్థులతో రాష్ట్రవ్యాప్తం గా ఆందోళన చేపడతామన్నారు.

## ఆర్థిక సాయం అందజేత

వేములవాడ, మార్చి 31 : అనారోగ్యంతో వేములవాడ ప్రభుత్వ దవాఖానలో రవి చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ కౌన్సిలర్ ముద్రకోల వెంకటేశం సోమవారం రూ.10 వేలు సాయం అందజేశారు. రెండు కండ్లు కనిపించక పోగా, కిడ్నీలు కూడా చెడిపోయి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నందున తమవంతుగా సాయంగా అందజేసినట్లు తెలిపారు. మాజీ కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, సిరిగిరి రామచందర్, గోలీ మహేశ్, మారం కుమార్, రాజు ఉన్నారు.

## ఇద్దరికి గాయాలు

చందుర్తి, మార్చి 31: మండల కేంద్రం శివారులోని పెట్రోల్ బంక్ సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన చింతపల్లి వెంకటేశ్వరరావు తన తల్లి సరోజన, కూతురు చింతపల్లి నిత్యతో కలిసి చందుర్తి నుంచి వేములవాడకు బైక్‌పై వెళ్తున్నాడు. పెట్రోల్‌బంక్ సమీపంలో హార్వెస్టర్ వాహనాన్ని ఓవర్‌టేక్ చేస్తున్న క్రమంలో ఓ కారు అద్దం తగలడంతో వీరి బైక్ కిందపడింది. ఈ ప్రమాదంలో సరోజన పరిస్థితి విషమంగా ఉండడంతో 108 అంబులెన్స్‌లో వేములవాడలోని ఏరియా దవాఖానకు తరలించారు. వెంకటేశ్వరరావు, నిత్యకు స్వల్ప గాయాలయ్యాయి.

## ప్రమాద కారకుడిపై కేసు

ఎలారెడ్డిపేట, మార్చి 31: అజాగ్రత్తగా, రాంగ్‌రూట్‌లో ఆటో నడిపిన డ్రైవర్ అనరాసి దుర్గయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. సోమవారం రాత్రి నారాయణపూర్‌కు చెందిన షేక్‌అవీజ్, అఫ్రోజ్ తమ స్కూటీపై సిరిసిల్లకు వెళ్తుండగా వెంకటాపూర్ నుంచి రాంగ్‌రూట్‌లో వచ్చిన ఆటో డ్రైవర్ దుర్గయ్య స్కూటీని ఢీకొట్టడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అవీజ్ తండ్రి సమద్ ఠాణాలో ఫిర్యాదు చేయగా దుర్గయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ Wanted Sales Executives @ Karimnagar, Unic Chem Technologies to make Best Future in Water Treatment Plants & Chemicals. Ph: 9573244611, raju@unicchem.com
NT-330931

డాక్యుమెంట్స్ పోయినది

★ గండికోట అయిలయ్య S/o. ఉప్పలయ్య, పేరు మీద గల విక్రయ దస్తావేజు నెం. 2727/1997 గలది బోత్తలపల్లి నుండి సైదాపూర్‌కు పోతున్న సందర్భంలో పోయినది. ఇది దొరికిన వారు Cell No: 84519 58499 నెంబరుకు సంప్రదించగలరు.
NTK-00000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571
9182 777 189

THE MASTERMINDS SCHOOL
Come, let's explore and learn together...

WE'RE HIRING!

POSITIONS AVAILABLE:
- Pre-Primary Teachers - Minimum 2 years of experience
- Primary Teachers (All Subjects) - Minimum 2 years of Experience
- High School Teachers (All Subjects) - Minimum 4 years of Experience

REQUIREMENTS:
- Strong speaking skills are mandatory
- Required qualifications are a must
- Salary : Negotiable based on performance
- Work Locations: Sircilla & Yellareddipet

INTERVIEW DETAILS:
- Date: April 1, 2025
- Venue: The Masterminds School, Yellareddipet or Sircilla
- Time: 10:00 AM - 3:00 PM

HOW TO APPLY: Send your resume via Whatspp:
62813 48696 / 91823 38620
76619 36280

# మున్సిపల్ పాలకవర్గ పరిపాలన వివరాలు తెలపాలి


మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు రమణ

కలెక్టరేట్, మార్చి 31: సిరిసిల్ల మున్సిపల్ పాలకవర్గం ఐదేళ్ల పరిపాలన వివరాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రజలకు వివరంగా తెలపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోడం రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం బీవైనగర్‌లోని అమృత్‌లాల్ శుక్లాకార్మిక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీఎం జిల్లా కార్య వర్గ సభ్యుడు కే రమణ, పట్టణాధ్యక్షుడు అన్నల్‌దాస్ గణేశ్ మాట్లాడారు. జిల్లాలో గడచిన ఐదేళ్ల కాలంలో సిరిసిల్ల మున్సిపాలిటీలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి కాంట్రాక్టులు, కార్మికుల నియామకం, ఇతర విషయాల్లో పలు అక్రమాలు జరిగాయని, కొన్ని ఉదాహరణలతో మార్చి 29న కాంగ్రెస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కొంతమంది మాజీ మున్సిపల్ పాలకవర్గ సభ్యులతో కలిసి ప్రెస్‌మీట్ పెట్టి ఆరోపించడం జరిగిందన్నారు. సదరు ఆరోపణలను ఖండిస్తూ మార్చి 30న బీఆర్ఎస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పలువురు మాజీ పాలకవర్గ సభ్యులతో కలిసి ప్రెస్‌మీట్ పెట్టి కాంగ్రెస్ నాయకులు చేసిన ఆరోపణలు అవాస్తవమని ఐదేళ్ల కాలంలో మున్సిపల్‌లో ఎక్కడా అక్రమాలు జరగలేదని, అలా జరిగి ఉంటే ఆధారాలతో నిరూపించాలన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పాలకవర్గ గడువు ముగిసి 2 నెలలు అవుతుందని ప్రస్తుతం కలెక్టర్ మున్సిపాలిటీకి ప్రత్యేక పాలన అధికారిగా వ్యవహరిస్తున్నారన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల ఆధ్వర్యంలో చేసిన ఆరోపణలపై గత ఐదు సంవత్సరాల కాలంలో సిరిసిల్ల మున్సిపల్ పాలకవర్గ పరిపాలనలో జరిగిన పూర్తి వివరాలను కలెక్టర్ ప్రత్యేక విజిలెన్స్ కమిటీ వేసి సమగ్రమైన విచారణ జరిపించి, పూర్తిస్థాయిలో పట్టణ ప్రజలందరికీ తెలియజేయాలని ఒక వేళ అక్రమాలు జరిగినట్లయితే అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యుడు కమలాకర్ పాల్గొన్నారు.

## ఆర్టీసీ డ్రైవర్లకు సన్మానం


ఉద్యోగ విరమణ పొందిన డ్రైవర్లను సన్మానిస్తున్న ఆర్టీసీ డీఎం ప్రకాశ్‌రావు

కలెక్టరేట్, మార్చి 31 : విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసి, ప్రయాణీకులను మూడు దశాబ్దాలుగా సురక్షితంగా వారివారి గమ్యస్థానాలకు చేర్చిన డ్రైవర్లకు ఆర్టీసీ సంస్థ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని సిరిసిల్ల డిపో మేనేజర్ ప్రకాశ్ రావు అన్నారు. సోమవారం డిపోలో ముగ్గురు డ్రైవర్లు ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆర్టీసీ యాజమాన్యం, సిబ్బంది, బంధు మిత్రులు ఘనంగా వారిని సన్మానించారు. సిరిసిల్ల ఆర్టీసీ డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉద్యోగ విరమణ పొందుతున్న ఆర్టీసీ డ్రైవర్లు కేవీస్ రెడ్డి, బీ రఘుపతి, డీ రాజేశ్వర్‌ను డిపో మేనేజర్ ప్రకాశ్‌రావుతో పాటు సిబ్బంది ఘనంగా శాలువాతో సన్మానించి, వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో రాజిరెడ్డి, ఏఎం రెడ్డి, రిటైర్డ్ ట్రాఫిక్ సూపర్‌వైజర్ సుధాకర్, నాయకులు జీపీ సింగ్, పాపారావు, దేవయ్య, బానయ్య, గ్యారేజీ ఇన్‌చార్జి భీముడు పాల్గొన్నారు.

# రైతులతోనే సహకార సంఘం అభివృద్ధి

**సింగిల్ విండో చైర్మన్ రామ్మోహన్‌రావు**


మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్లయ్య, డైరెక్టర్లను సన్మానిస్తున్న సింగిల్ విండో చైర్మన్ సంకినేని రామ్మోహన్‌రావు

కోనరావుపేట, మార్చి 31: రైతుల సహకారంతోనే సంఘం నిరంతరం అభివృద్ధి చెందుతుందని కొలనూర్ సింగిల్ విండో చైర్మన్ సంకినేని రామ్మోహన్‌రావు అన్నారు. సోమవారం కొలనూర్ గ్రామంలోని పీఏసీఎస్ అధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సహకార సంఘం రైతులకు రాయితీ లోన్లను అందించనున్నట్లు తెలిపారు. రైతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను కూడా ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. అనంతరం నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చుకాయల ఎల్లయ్య, వైస్‌చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, డైరెక్టర్ సాసాల మల్లారెడ్డితో పాటు పలువురు డైరెక్టర్లను చైర్మన్ రామ్మోహన్‌రావు, వైస్‌చైర్మన్ కాశవేణి మహేశ్ యాదవ్ శాలువాతో సన్మానించారు. సీఈవో రాజేశం, సింగిల్ విండో డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం

కోనరావుపేట, మార్చి 31: మండలంలోని మల్కపేట గ్రామం లో శ్రీరాజరాజేశ్వర మినరల్ వాటర్ ప్లాంట్ ఆధ్వర్యంలో బొల్లారం తిరుపతి గ్రామ పంచాయతీ ఆవరణలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా, గ్రామస్తులు ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ, ప్రయాణికులకు, వాహనదారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తిరుపతిని గ్రామస్తులు అభినందించారు. గ్రామస్తులు దేవదాస్, జవ్వాజీ అంజయ్య, వెల్పుల తిరుపతి, గణేశ్, జలెందర్ తదితరులు ఉన్నారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న గ్రామస్తులు

# భక్తిశ్రద్ధలతో ఈద్-ఉల్-ఫితర్

- ముస్లింల సామూహిక ప్రార్థనలు
- కిక్కిరిసిన మసీదులు
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

జిల్లాల్లో సోమవారం ఈద్-ఉల్-ఫితర్‌ను ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకొన్నారు. రంజాన్ మాసం సందర్భంగా నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేయగా, ఆదివారంతో ముగిశాయి. సోమవారం ఉదయమే ఈద్గాలు, మసీదుల వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకొని ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు అలయ్.. బలయ్ తీసుకున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బంధువులు, స్నే హితులను ఇండ్లకు ఆహ్వానించి స్వీట్లతో పాటు భోజనం పెట్టారు.

**- నమస్తే, నెట్‌వర్క్**


గంభీరావుపేట : ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


సిరిసిల్ల రూరల్: ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు


ఇల్లంతకుంట : ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు